ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు
5★★
మంగళవారం 22 అక్టోబరు 2024



నోరూరించే.. సీతాఫలం


సీతా ఫలాలు విక్రయిస్తున్న రైతులు

- గుట్టలు... అటవీ ప్రాంతాల నుంచి సేకరణ
- ఏళ్ల తరబడి ఈ వ్యాపారంపైనే ఆధారపడిన 200 కుటుంబాలు
- కొండగట్టు...మల్యాల రోడ్డు వైపున జోరుగా విక్రయాలు
- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు తరలించి అమ్మకాలు



సీతాఫలం..ఈ పండు పేరు వింటేనే చటుక్కున నోట్లో నీళ్లూరడం సహజం. ఎందుకంటే అంతటి మధుర ఫలం మరి. ప్రస్తుతం సీతాఫలం సీజన్ నడుస్తోంది. మార్కెట్లో బుట్టలు బుట్టలుగా పెట్టి వాటిని విక్రయిస్తున్నారు. ఒకటి, రెండు కాకుండా ఏకంగా బుట్టల్లోనే కొని ఇంటికి తీసుకెళ్తుంటారు. ఎందుకంటే ఇంటిల్లి పాది ఇష్టపడే పండు కాబట్టి పెద్ద మొత్తంలోనే కొనేస్తారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాల్లో ఈ పండ్లు ఎక్కువ దొరుకుతాయి కాబట్టి అమ్మకాలు జోరుగానే సాగుతాయి. మందులు వాడకుండా పండించే పండు కావడంతో పాటు పోషక విలువలు కూడా ఎక్కువే. అందుకే కాస్త పైసలు ఎక్కువైనా ఆలోచించకుండా కొంటారు సీతాఫల ప్రియులు. జిల్లాలోని మల్యాల మండలం కొండగట్టు, కొడిమ్యాల, నాచుపల్లి ప్రాంతాల్లో ఎక్కువగా అమ్ముతారు. అమ్మకాలు, లాభాలు ఇలా మరికొన్ని విషయాలు తెలుసుకుందాం రండి..

జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నుంచి కరీంనగర్ వెళ్లే జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో సీతా ఫలాల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. దొంగలమర్రి సమీపంలోని చెప్యాల చౌరస్తా, కొడిమ్యాల చౌరస్తా, నాచుపల్లి, బల్వంతపూర్ చౌరస్తాల వద్ద ఆయా గ్రామాల సమీపాల్లోని గుట్టలు, చేను గట్ల ప్రాంతాల నుంచి సేకరించిన సీతా ఫలాలను రోడ్డు పక్కన కుప్పలుగా పోసి విక్రయిస్తుంటారు. బుట్టల చొప్పున వీటిని విక్రయిస్తున్నారు.

సుమారు 200 కుటుంబాలకు జీవనోపాధి...

జిల్లాలోని సర్వాపూర్, తాటిపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 కుటుంబాలకు చెందిన సభ్యులు సీతా ఫలాలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ సీజన్ అయిపోయాక ప్రత్యామ్నాయ పనులతో ఉపాధి పొందుతుంటారు. శీతాకాలంలో ప్రతీ రోజు తెల్లవారు జామున 4 గంటలకే సీతా ఫలాలు బుట్టల్లో పెట్టుకొని ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రధాన రహదారిపైకి వచ్చి రోడ్డుకిరువైపులా విక్రయిస్తుంటారు. మరికొందరు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి వంటి పట్టణాలకు సైతం వాహనాల్లో తరలించి విక్రయిస్తున్నారు. ఇందులో కొందరు సొంత చెట్లు ఉన్న రైతులు కూడా లాభాలు పొందుతున్నారు..

తరువాయి 8వ పేజీలో

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- 5.73 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా
- జిల్లాలో 421 కేంద్రాల ఏర్పాటు
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు



జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో సాగైన వరి ధాన్యం సేకరణను పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము.. జిల్లాలో ఆలస్యంగా వరినాట్లు వేసుకోవడంతో అక్టోబర్ చివరి వారం, నవంబరు మొదటి, రెండో వారాల్లో కోతలు ప్రారంభం కానున్నాయి.. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా అదనపు కలెక్టర్‌రాంబాబు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎంత వరి ధాన్యం వస్తుందన్న అంచనా ఉంది..?

అదనపు కలెక్టర్ : జిల్లాలో 5.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా ఉంది.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు..?

అదనపు కలెక్టర్ : జిల్లా వ్యాప్తంగా 421 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాము. ఇందులో 133 కేంద్రాలు ఇందిరా కాంతి పథం మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయనుండగా, 277 కేంద్రాలు సహకార శాఖ ద్వారా, ఒకటి మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : కొనుగోళ్లకు ఎన్ని గన్నీ సంచులు అవసరమవుతాయి...? అందుబాటులో ఉన్నవి ఎన్ని..?

అదనపు కలెక్టర్ : ధాన్యం కొనుగోళ్లకు 1.43 లక్షల గన్నీ సంచులు అవసరం ఉండగా, ప్రస్తు తం జిల్లాలో 23 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయి. మరో 1.20 లక్షల గన్నీ సంచులను కొనుగోలు చేయడానికి పౌరసరఫరా శాఖ అధికారులను ఆదేశించాము.

తరువాయి 8వ పేజీలో

శివాలయంలో రుద్రహోమం

రాయికల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయానికి మళ్లీ పునః వైభవం వచ్చి భక్తులతో కిటకిటలాడుతోంది. కొన్ని నెలల క్రితం ఆలయ పూజారి, నిర్వాహకులు శివలింగం శివైక్యం కావడంతో ఆలయం కల తప్పి వెలవెలబోయింది. పూజారి లేకపోవడంతో భక్తులు రాక తగ్గింది. ఆ వేదనకు లోనైన శివ భక్తులు ఆలయ పునః వైభవానికి నడుం బిగించారు. 'పేర్లు, ప్రతిష్ట కోసం పాకులాడకుండా 'మన శివాలయం' పేరు మీద వాట్సాప్ గ్రూపుగా ఏర్పడ్డారు. ఆలయం యాజమాన్యంతో మాట్లాడి ఆలయానికి భక్తుల సహకారంతో ఆలయానికి రంగులు వేయడం, వాటర్ ట్యాంక్, హనుమాన్ ఆలయం చుట్టూ రెయిలింగ్ కంచె ఏర్పాటుతో పాటు ఆలయ పూజారిని ఏర్పాటు చేశారు. దీంతో ఆలయంలో రోజువారీ పూజలు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మణులతో సోమవారం మహా రుద్రహోమం నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజాది కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. అనంతరం మహా అన్నదానంలో అన్న ప్రసాదాలు స్వీకరించారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ సత్య ప్రసాద్
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం


అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :విధి నిర్వాహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పోలీసు అమరవీరులకు పుష్ప గుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. పోలీసు సిబ్బంది, అధికారులు తమ పరేడ్‌తో నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు హాజరై తమ కన్నీళ్లతో నివాళులు అర్పించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ భీంరావ్ దేశ వ్యాప్తంగా అమరులైన పోలీస్ అధికారుల త్యాగాలను గుర్తు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పటిష్టమైన శాంతి భద్రతలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నా రు. సొసైటీలో శాంతియుతంగా, ప్రశాంతంగా జీవిస్తు న్నా మంటే దానికి 24 గంటలు పనిచేస్తున్న పోలీసులే కారణమన్నారు. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈ సమాజం కోరుకు నేది శాంతి, స్థిరత్వం, అభివృద్ధి అని వీటిని పోలీస్ శాఖ వారి త్యాగాల ద్వారా ఎన్నో దశాబ్దాలుగా సమాజంలో ప్రతి ఒక్కరికి రక్షణ కల్పిస్తుందని వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించి అమరులైన పోలీసు త్యా గాలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమా మహేశ్వర్‌రావు, రాంగారెడ్డి, డీసీ ఆర్‌బీ, సీసీఎస్, ఐటీ కోర్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్, కిరణ్ కుమార్, రామకృష్ణ, వేణు, ఆరీఫ్‌అలీ ఖాన్, సీఐలు వేణుగోపాల్, రాంన ర్సింహారెడ్డి, రవి, నిరంజన్‌రెడ్డి, సురేష్‌తో పాటు ఎస్సైలు, అమర వీరుల కుటుంబ సభ్యులు ఉన్నారు.

రైతు ముసుగులో బీఆర్ఎస్ నేతల ధర్నా

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైతు ముసుగులో బీఆర్ఎస్ నాయకులు దొంగ ధర్నా చేశారని, అన్నదాతలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే సారి రైతు రుణమాఫీ చేసిందని, ఇందుకు రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పేరిట రైతులందరని మోసం చేసిందన్నారు. అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి రైతులను నట్టేట ముంచిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ధర్నాలో అసలు రైతులే లేరని. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే రైతు కండువాలు కప్పుకుని ప్రజలను తప్పుదొవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని కలిసి పని చేయాలని సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మహిళా ఉద్యోగులతో కలెక్టర్ సత్యప్రసాద్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 21: పనిచేసే చోట మహిళా ఉద్యోగినులు ఎదుర్కొనే వేధింపులను ఎదుర్కొనేందుకు ప్రతి ఉద్యోగిని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం, పరిష్కార చట్టం-2013) కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల భద్రతే లక్ష్యంగా ఈ చట్టం రూపకల్పన జరిగిందన్నారు. ప్రతి కార్యాలయంలో కమిటీలు వేస్తామని, బాధిత మహిళా ఉద్యోగులు ఈ కమిటీలకు ఫిర్యాదు చేసి న్యాయం పొందాలన్నారు. అంతకు ముందు జిల్లా సంక్షేమ అధికారి భోనగిరి నరేష్ మాట్లాడుతూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ)లో నలుగురు సభ్యులుంటారన్నారు. ప్రొసీడింగ్ ఆఫీసర్ ఆర్గనైజేషన్‌లో పనిచేసే మహిళా ఉద్యోగి మహిళా చట్టాలు హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మిగతా ఇద్దరు సభ్యులు ఆడ, మగ ఆడవాళ్ల చట్టాలు, హక్కుల గురించి పనిచేసే ఎవరైనా ఉండాలని, మిగతా ఒకరు ఏదైనా ఎన్జీవో సభ్యులుగా ఉండోచ్చన్నారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు రూపుమాపేందుకు, స్త్రీ, పురుష సమానత్వం సాధించడానికి 2013లో ఈ చట్టానికి రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి, తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరగాలి

ఎస్పీ అశోక్ కుమార్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతు న్న ట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జి ల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సో మవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలు వురు అర్జిదారులతో ఎస్పీ నేరుగా మా ట్లాడి వారి సమస్యలను తెలు సుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మా ట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయా లని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యా దగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. ప్రజా సమ స్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వివరించారు.

మత్స్య సంపద పెంచడమే లక్ష్యం

- వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


తాండ్ర్యాల చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

8

రైతు నేస్తం..పొలాస క్షేత్రం

- ఉత్తర తెలంగాణకు తలమానికంగా వ్యవసాయ కేంద్రం
- అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల
- వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాలలు


పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానము

6

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్


ప్రజావాణిలో వినతిపత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 46 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, స్థానిక సంస్థల ఇంచార్జీ అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ హన్మంత రావు, డీపీవో రఘువరన్‌లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి

జగిత్యాల అర్బన్ : ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్సీ ఓటరు విచారణ, ఓటరు జాబితా రూపకల్పనపై ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల స్థానానికి లక్ష దరఖాస్తులు, ఇది చాలా స్థానానికి 2004 దరఖాస్తులు వస్తే పట్టభద్రుల దరఖాస్తులు 7 వేలు మాత్రమే విచారణ పూర్తయ్యాయని అన్నారు. అలాగే వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయుల స్థానానికి 2730 దరఖాస్తులు వస్తే అన్ని పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను ఓటరు నమోదు జాబితాలో నవంబరు 6లోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఫోటో జాబితా సవరణ కోసం స్లీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని, దీనికోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని అన్నారు. 2025 జనవరి 1వ తేదీనాటికి 18 ఏళ్ల నుంచి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ప్రధానంగా దివ్యాంగులు, థర్డ్ జెండర్, సెక్స్ వర్కర్స్, ఆదివాసీ గిరిజనుల ఓట్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కరువు భత్యం వెంటనే విడుదల చేయాలి

టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 21: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌లకు తెలంగాణ రాష్ట్రంలో బకాయిపడిన ఐదు విడతల కరువు భత్యం నిధులు వెంటనే విడుదల చేయాలని టీఆర్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్‌గౌడ్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ 2022 జూలై మాసం నుంచి ఇప్పటివరకు ఐదు విడతల కరువు భత్యం అందించాల్సి ఉందన్నారు. తెలంగాణలో ప్రజాపాలన మొదలైన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్యం ప్రకటిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఈ ఎన్నికల హామీని ఇప్పటికీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డీఏలు విడుదల చేయలేని పక్షంలో పోరుబాటకు ఉద్యోగులు సిద్ధపడతారని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు అన్నిటినీ త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ బాధ్యులు నాయిని విజయానందరావు, ఓదెల శేఖర్, గుండ శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సురేష్

క్రైం కార్నర్

భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు. దోమకొండ మండలం తుల్జాపూర్‌కు చెందిన సుంకరి రాజుకు ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన మేఘమాలతో 2010లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధింపులకు గురిచేశాడు. 2015లో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజుపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై మారుతి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ సందీప్ వాదించగా ముస్తాబాద్ ఎస్సై గణేశ్, సీఎంస్ ఎస్సై రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడు సుంకరి రాజుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు చెప్పారు.

గంభీరావుపేటలో యువకుడి అదృశ్యం

గంభీరావుపేట, అక్టోబర్ 21: (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసల గూడెంకాలనీకి చెందిన బరిగెల బాబు అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లిన బాబు తిరిగి రాలేదు. బాబు కోసం మూడు రోజులుగా కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఆచూకీ లభ్యం కాక సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో 'కేశోరాం' కార్మికుడి ఆత్మహత్య

పాలకుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేశోరాం వర్కర్స్ కాలనీలో నివాసముంటున్న కంపెనీ కార్మికుడు ఆదివారం రాత్రి ఉరేసుకొని మృతి చెందినట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపారు. ఎస్‌ఐ సోమవారం వివరాలను వెల్లడించారు. కన్నం కేశవులు(55) కంపెనీలో పర్మినెంటు వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యలతో విధులకు సరిగా హాజరు కాలేదు. దీంతో మనోవేదనకు గురై తన క్వార్టర్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కేశవులు తండ్రి కన్నం నాగయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం బసంత్‌నగర్ తెలుగు మీడియం పాఠశాలలో జరిగిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మ వెంకన్న(65) వృద్ధుడు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని స్వంత కొట్టంలో దులానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య దేవవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

● తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని అసుపత్రిలో చూపించి తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులిద్దరూ తీవ్రంగా గాయపడిన సంఘటన సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేటకు చెందిన మల్లేశంను ఆస్పత్రిలో చూపించడం కోసం ఆయన కొడుకు మధునయ్య బైక్‌పై కరీంనగర్ వెళ్లారు. తండ్రిని అస్పత్రిలో చూపించి మందులు తీసుకుని తిరిగి సోమవారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా వీరి బైక్‌ను వెనక నుంచి వేగంగా వస్తున్న ఇసుక లారీ భూపతిపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై ఢీకొట్టింటి. ఈ ప్రమాదంలో తండ్రికి కుడి కాలు తెగిపడిపోగా, కొడుకకు కాళ్లకు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే కరీంనగర్ అస్పత్రికి అంబులెన్సులో తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లిపోయిందని గ్రామస్థులు తెలిపారు.

భూమి అమ్మి మోసం చేసిన వారిపై కేసు

వీణవంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భూమి అమ్మి కొంత భూమి రిజిస్ట్రేషన్ చేసి మిగతా భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థుడైన మేక రమేష్‌కు కరీంనగర్‌కు చెందిన అన్‌రెడ్డి ప్రకాష్‌రెడ్డి అన్‌రెడ్డి అరుణ వారికున్న ఏడెకరాల 19 గుంటలు రూ. 71 లక్షల 50 వేలకు అమ్ముతామని నమ్మబలికి మొత్తం రూపాయలు ముట్టిన తర్వాత ఐదు ఎకరాల 32 గుంటలు మాత్రమే పట్టా చేశారని తెలిపారు. మిగతా భూమిని పట్టా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని, తన వద్ద పైసలు తీసుకొని మోసం చేశారని మేక రమేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

వెల్గటూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కట్రావుపేట గ్రామానికి చెందిన మేకల రాజయ్య(40) అనే వ్యక్తి సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాజయ్య కొద్ది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం ఇంటిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నట్లు కుటుంబీకులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి సోదరుడు మేకల మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలుసుకోవడానికి శవాన్ని పంచనామా నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోతనకాలనీకి చెందిన మంథని ప్రవీణ్‌కుమార్ (29) అదృశ్యమైనట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. 2 ఇంక్లయిన్ గనిలో పనిచేస్తున్న ప్రవీణ్‌కు ఇటీవల నిశ్చితార్థం జరిగింది. బంధువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లి సోమవారం తెల్లవారు జామున ఇంటికి వచ్చే సరికి ప్రవీణ్ కనిపించలేదు. ప్రవీణ్ మొబైల్ స్విచ్ ఆఫ్ రావడంతో ఇరుగు పొరుగు వారికి, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రవీణ్ తండ్రి మంథని రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

చందుర్తి, కోనరావుపేట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సరఫరా కేసులో పరారీలో ఉన్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో జూలై 25న కావేరి కాటన్ మిల్ వద్ద గంజాయి సరఫరా చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదైంది. వారిలో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. ఈ కేసులో మర్తనపేట గ్రామానికి చెందిన నీరటి సాయికుమార్ పరారీలో ఉండగా సోమవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

91 గ్రాముల గంజాయి స్వాధీనం

మంథని, అక్టోబర్ 21: స్థానిక బస్ డిపో సమీపంలో మంథనిలోని పోచమ్మవాడకు చెందిన కుడుదుల సూర్యవర్ధన్‌అనే యువకుడి వద్ద నుంచి 91 గ్రాముల ఎండు గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. తమకు అందిన సమాచారంతో తాము బస్ డిపో సమీపంలో చూడగా సూర్యవర్ధన్ అనుమానాస్పదంగా ఉండి తమను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్ తనిఖీ చేయగా 91 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ వెళ్లి తనకు పరిచయం ఉన్న కీర్తిక్ అనే వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసినట్లు సూర్యవర్ధన్ వెల్లడించారన్నారు. తన వద్ద ఉన్న గంజాయిని స్థానిక శ్రీపాదకాలనీలో తనకు పరిచయస్థులైన తైడల సురేష్, పెండ్యాల సునీల్, ఆసంపెల్లి తరుణ్, లక్క రవివర్మలతో కలిసి గత కొంత కాలంగా గంజాయిని తాగుతున్నట్లు సూర్యవర్ధన్ వెల్లడించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానము

రైతు నేస్తం..

వ్యవసాయ అభివృద్ధి, రైతుల శ్రేయస్సే ధ్యేయంగా జగిత్యాల జిల్లాలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పనిచేస్తోంది. వ్యవసాయ రంగంలో ఉత్తర తెలంగాణకు పొలాల క్షేత్రం తలమానికంగా నిలుస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో బీఎస్సీ, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ స్పెషలైజేషన్, జెనెటిక్స్ తదితర కోర్సులను అందిస్తున్నారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ తయారైన పలు రకాల విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయి.
ఎప్పటికప్పుడు అధిక దిగుబడిని అందించే కొత్త కొత్త వంగడాలను సృష్టిస్తూ పరిశోధన స్థానం తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది.

పొలాస క్షేత్రం

ఉత్తర తెలంగాణకు తలమానికంగా వ్యవసాయ కేంద్రం

- అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల
- వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాలలు



జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొలాస ప్రాతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రా నికి ప్రత్యేక స్థానం ఉంది. 1983 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పరిశోధన స్థానాన్ని ప్రారంభించారు. సుమారు 48.96 హెక్టార్ల విస్తీర్ణంలో పరిశోధన స్థానం ఉంది. ఈ కేంద్రం పరిధిలో కరీంగనర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పరిశోధన క్షేత్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ పరిశోధన స్థానం తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన రైతులకు అవసరమైన సేవలు అందిస్తోంది. కళాశాల నూతన వంగడాలపై పరిశోధనలు చేస్తూ, రైతులకు సాగులో మెళకువలు చెప్తూ, సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ రైతు నేస్తంగా పొలాస వ్యవసాయ పరిశోధన క్షేత్రం కృషి చేస్తోంది. పలు ఆటు పోట్లను అధిగ మిస్తూ ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యంత ఉత్తమ ప్రదర్శన క్షేత్రంగా ఖ్యాతి గడించడం పట్ల జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వ్యవసాయ ప్రయోగాలు చేస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

అనుబంధ కళాశాలలు ఇవీ..

పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి అనుబంధంగా 2008 సంవత్సరంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల, 2013లో వ్యవసాయ పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు అయ్యాయి. వ్యవసాయ కళాశాలలో 150 సీట్లు, పీజీలో 14 సీట్లు ఉన్నాయి. ఈ కళాశాలలో ప్రవేశం పొందు తున్న వారిలో అధికంగా బాలికలు ఉంటున్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ప్రారంభం అయ్యింది. పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులకు రూ. 20 కోట్లతో పక్కా భవనం నిర్మించడంతో సమస్య సద్దుమణిగింది. ప్రస్తుతం వ్యవసాయ కళాశాలలో ప్రతీ యేటా సుమారు 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ఒకే ప్రాంగణంలోనే వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఉండడం వ్యవసాయ విద్యావ్యాప్తికి దోహదపడుతోంది.

తొలినాళ్లలో అవస్థలు, అసౌకర్యాలతో ఇబ్బందులు పడ్డ పరిశోధన స్థానం నేడు అన్ని హంగులతో వ్యవ సాయరంగంలో ఒక వెలుగు వెలుగుతూ రైతన్నలకు పరిశోధన ఫలాలు పంచుతూ జిల్లాకే తలమాణికంగా నిలుస్తోంది. కార్యాలయ నిర్వహణతో పాటు, పరిశోధనలకు సైతం ఊతం ఇస్తూ వంగడాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ముందు వరుసలో ఉన్నారు. ఏటా విత్తన మేళా నిర్వహించి రైతులకు అవసరమైన విత్తనాలను అందిసున్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాల కోసం..

ప్రధానంగా జిల్లాకు ఆయువుపట్టుగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద పండే పంటలైన వరి,


క్షేత్ర స్థాయి వ్యవసాయ పనుల్లో కళాశాల విద్యార్థులు

మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ పంటలకు సంబంధించి అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, కీటకాలు, చీడ పీడలను, వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలబడి, రైతుకు లాభాలు ఇచ్చే పంటల విత్త నాలను పరిశోధన కేంద్రంలో కనిపెడుతున్నారు. వీటిని రైతులతో పాటు ప్రభుత్వం ద్వారా ప్రైవేటు విత్తన సంస్థలకు అందజేస్తారు. జగిత్యాల పరిశోధన స్థానంలో తయారైన పలు వరి, మొక్కజొన్న, నువ్వు విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయంటే పరిశోధనల ఫలితం, శాస్త్రవేత్తల కృషికి అద్దం పడుతున్నాయి.

మేలైన వంగడాలకు కేరాఫ్‌గా...

రైతులెంత చెమటోడ్చినా వేలకు వేలు పెట్టుబడి పెట్టిన దిగుబడి లేక నష్టాల్లో దిగబడి పోతున్నారంటే నాణ్యమైన వంగడాలు అందక పోవడమే కారణం అని భావిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించడం పై పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. వరి ప్రధాన పంటగా సాగుచేస్తున్న తెలంగాణ రాష్ట్రంలో వరి పరిశోధనలకు కేంద్ర బిందువుగా నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా జగిత్యాల జిల్లాలో గల పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పని చేస్తుంది. ఇక్కడ రూపొందించిన విత్తనాలు తెలంగాణతో పాటు ఉత్తర భారత దేశంలో సాగులో ఉండడం గమనార్హం.

ఇక్కడి నుంచి వరిలో జగిత్యాల సన్నాలు, పొలాస ప్రభ, జగిత్యాల సాంబ, కరీంనగర్ సాంబ, జగిత్యాల మసూరి, ప్రాణహిత, మానేరు, బతుక మ్మ రకాలను విడుదల చేశారు. నువ్వుల్లో హిమ చందన, రాజేశ్వరీ, స్వేతాతిల్, పసుపులో సుగుణ, సుదర్శన వేరుశనగలో జేజీఎల్ 98 రకాలను శాస్త్రవేత్తలు రూపొందిం చారు. పంటల సరళి, కొత్తకొత్త రకాలతో ఈ పరిశోధన స్థానం విశేష స్థానం పొందింది. పరిశోధన ఫలాలను అన్నదాతల క్షేత్రాలకు చేరవేసే శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ వంగడాలన్నీ ఉల్లి కోడును, అగ్గి తెగులును సమర్థవంతంగా ఎదుర్కోగలిగే సామర్థ్యం ఉన్నవే కావడంతో రైతుల్లో మంచి స్పందన లభిస్తుంది. అనేక రకాల వరి, ఇతర వంగడాలపై పరిశోధనలు, ప్రదర్శనలు ఏటా జరుగుతుండడం, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడం, సాగులో మెళకులవలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ దినదినాభివృద్ధి చెందుతోంది.


జెజీఎల్ 28545 సన్న వరి గింజ రకం ప్రదర్శన

న్యాయం చేయాలని బాధిత కుటుంబీకుల ఆందోళన

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తన భర్తను చంపింది ఒక్కరు కాదు, ముగ్గురని వారిపై చర్యలు తీసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ డీజిల్ డబ్బాతో మృతుడి భార్య, బంధువులతో కలిసి సోమవారం పట్టణంలో ఆందోళన చేపట్టింది. మల్లాపూర్ మండలం ఓబులపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలును తమ్ముడు ఆదివారం హతమార్చాడు.

అయితే మృతుడు సాయిలును చంపింది సాయిలు తమ్ముడితో పాటు మరో ఇద్దరు ఉన్నారని మృతుడి భార్య నవ్య ఆరోపిస్తూ తమ కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని మొదట మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసనకు దిగింది. ఆనంతరం బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ తన భర్త సాయిలును మొత్తం ముగ్గురు కలిసి పక్కా ప్రణాళిక ప్రకారమే హత్య చేశారని ఆరోపించారు. మృతుడి మెడలో తులం బంగారం, 40 వేల విలువగల ఫోన్. పది వేల నగదు లాక్కొని తన భర్తపై ఇద్దరు తమ్ముళ్లు, మరో మేకల మంద యాజమానితో కలిసి హత్య చేశారని తెలిపింది. గతంలో భూ వివాదాలు ఉండేవని గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయని, కేసులు కూడా నమోదయ్యాయని ఆమె తెలిపింది. తన భర్త మృతి చెందడంతో ఇద్దరు కూతుళ్లకు ఆధారం లేదని కన్నీరు మున్నీరైంది. తన పిల్లలకు న్యాయం చేయాలని లేదంటే డీజిల్‌తో నిప్పంటించుకుంటానని ఆమె హెచ్చరించింది. సంఘటన స్థలానికి డీఎస్పీ ఉమామహేశ్వరరావు చేరుకుని బాధితురాలు నవ్యతో మాట్లాడి న్యాయం జరిగే లా చూస్తామని నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌లు ఉన్నారు.


డీజిల్ డబ్బాతో ఆందోళన చేస్తున్న మృతుడి భార్య నవ్య

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మంథని, అక్టోబరు 21: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మంథని జేకేఏ షోటోకాన్ కరాటే విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌స్ట్రక్టర్ కోండ్ర నాగరాజు సోమవారం తెలిపారు. గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 68వ ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు జరిగాయి. ప్రతిభను కనబర్చిన తమ విద్యార్థులు అండర్-14 విభాగంలో వడ్లకొండ శ్రీనిత, అండర్-17 విభాగంలో తోట హాసిని, రాగుల సహస్ర, బేరా ఆదిత్య తేజ, పొట్ల శ్రావణ్‌కుమార్, డుల్‌గచ్ దేవాన్ష్, రంగు శ్రీచరణ్‌లు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపి కైనట్లు తెలిపారు. వీరిని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, జేకేఏ సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ అభినందించారు.

అరటి పండ్ల గోదాంపై దాడులు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండి ఉస్మాన్ అలీ బ్రదర్స్ ఫ్రూట్స్ గోదాంలో సోమవారం ఫెడ్ఇన్‌స్పెక్టర్ అనూష సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాంలో నిల్వ ఉంచిన అరటి పండ్లను పరిశీలించారు. అరటి పండ్లు త్వరగా పక్వానికి రావడానికి విషపూరితమైన ఇథిలీన్‌ను అతిగా వాడుతున్నట్లు గుర్తించి గోదాంను సీజ్ చేసినట్లు తెలిపారు.

గోదావరిలో మునిగిన ఇసుక ట్రాక్టర్

మల్లాపూర్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వాల్గొండ సమీపంలోని గోదావరిలో సోమవారం ఓ ఇసుక ట్రాక్టర్ నీట మునింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి అధికారులు సోమవారం ఉదయం నీటిని విడుదల చేశారు. అధికారులు ఈ విషయంపై గోదావరి తీర ప్రాంత ప్రజలకు సమాచారం అందించారు. కొందరు ఇసుక వ్యాపారులు కూలీలతో కలిసి ట్రాక్టర్ తీసుకొని గోదావరి నదిలోకి ఉదయం వెళ్లారు. ట్రాక్టర్‌లో ఇసుక నింపుతుండగానే ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిం ది. కూలీలు, డ్రైవర్ ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి ఒడ్డుకు చేరుకున్నారు. గోదావరిలో మునిగిన ట్రాక్టర్‌కు గజ ఈతగాళ్లు తాడు కట్టి ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు తీసుకొచ్చారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌కు చెందిన కాంపల్లి శ్రీలక్ష్మి ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో తన ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. లక్ష్మిని ఫాదర్ షౌరెడ్డి అభినందించారు. సిరిసిల్లలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో కూడా పాల్గొని త్వరలో మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇండియన్ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన ఎస్ శ్వేత, డిప్రియదర్శిని కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ క్రిష్ణప్రియ తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఖోఖో ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో వీరిద్దరు ప్రతిభ చాటుకుని రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దుబాయ్‌లో చేనేత కళాకారుడి వస్త్ర ప్రదర్శన


హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు


హరిప్రసాద్ నేసిన వస్త్రాలు

సిరిసిల్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమలో అద్భుతాలు ఆవిష్కరిస్తున్న యెల్ది హరిప్రసాద్ మగ్గంపై నేసిన వివిధ వస్త్రాలను సోమవారం దుబాయ్‌లో దుబాయ్ ఎమిరేట్స్ పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. వస్త్రంపై మనుషుల బొమ్మలు, జీ 20 లోగో, అగ్గిపెట్టిలో అమిరె చీర వంటి వాటిని ప్రదర్శనలో ఉంచారు. సిరిపట్టు చీరలు, అంతరించిపోతున్న పీతాంభరం చీరతోపాటు నూలు పోగుల అల్లికలతో తయారు చేసిన చిత్రపటాల ప్రదర్శన అందరినీ అకట్టుకుంది. ఈ సందర్భంగా నేత కళాకారుడు హరిప్రసాద్‌ను అసోసియేషన్ ప్రతినిధులు గుత్తికొండ రవిచంద్ర, సరస్వతి సన్మానించారు.

రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో
కరీంనగర్‌కు కాంస్య పతకం



ఐజీ అవినాష్ మొహంతి నుంచి కాంస్య పతకం అందుకుంటున్న సీఐడీ కానిస్టేబుల్ శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో కరీంనగర్ పోలీస్ శాఖకు కాంస్య పతకం దక్కింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో పోలీసు డ్యూటీ మీట్ ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన డ్యూటీ మీట్‌లో పతకాలు పొందిన పోలీసులకు రాష్ట్రస్థాయి హైదరాబాద్‌లో పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ డ్యూటీ మీట్‌లో ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ సీఐడీ కానిస్టేబుల్ కాసుల శ్రీనివాస్‌కు కాంస్య పతకం దక్కింది. దీనితో పాటు ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌కు శ్రీనివాస్ ఎంపికయ్యారు. వచ్చే నెలలో జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించే ఆలిండి యా పోలీస్ డ్యూటీ మీట్‌లో శ్రీనివాస్ పాల్గొననున్నారు. శ్రీనివాస్‌కు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఐజీ అవినాష్ మొహంతి కాంస్య పతకం అందజేశారు.

సియోల్‌లో మంత్రుల బృందం

- వేస్టు టూ ఎనర్జీ ప్రాజెక్టు సందర్శన



సియోల్‌లో మంత్రుల బృందం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్తను రీసైకిల్ చేసి విద్యుత్‌గా మార్చే వేస్ట్ టు ఎనర్జీ(డబ్ల్యూటీఇ) కేంద్రాలను సందర్శించేందుకు రాష్ట్ర మంత్రుల బృందం సోమవారం దక్షిణ కొరియాలోని సియోల్‌కు చేరుకుంది. అక్కడ వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టును మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పరిశీలించారు.

సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ


కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 21: ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 35వ సౌత్ ఇండియా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎం వినయ్ 3 వేల మీటర్ల పరుగు పందెం లో సిల్వర్ మెడల్, జి నక్షత్ర అండర్-14 బాలికల ట్రైథ్లాన్ విభాగంలో సిల్వర్ మెడల్, విష్ణువర్ధన్ 10 వేల మీటర్ల నడక పోటీల్లో బ్రాంజ్‌మెడల్ సాధించా రు. ఈ సందర్భంగా విద్యార్థులను, కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవిలు అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

- మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ
- డిజిటల్, ఏఐ సాంకేతికతతో బోధన
- సాహస కృత్యాల్లో జాతీయస్థాయి గుర్తింపు
- చారిత్రక ప్రదేశాల పర్యటన

వైవిధ్యంగా బోధించడంతో పాటు.. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా అడుగులు వేయడానికి ఆ పాఠశాల ఉపాధ్యాయలు కృషి చేస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోధనతో పాటు ఏఐ సాంకేతికతను జోడించి ప్రత్యేకంగా వివిధ అంశాలపై వీడియో పాఠాలు బోధిస్తున్నారు. తరగతి బోధనే కాకుండా విద్యార్థులను చారిత్రక ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడి విశేషాలను తెలియజేస్తున్నారు. సాహస కృత్యాల్లో శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్నారు.



ఏఐ సహాయంతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

వైవిధ్య బోధన.. లక్ష్య సాధన

తిమ్మాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తరగతి గది బోధన మాత్రమే కాకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు.. మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు. డిజిటల్ బోధన, ఏఐ సాంకేతికత జోడించి వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. తరగతి గదుల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శారీరకంగా, మానసి కంగా ధృడంగా ఉండేలా విద్యార్థులకు సాసహకృత్యాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. చారిత్రక ప్రదేశాల పర్యటనకు తీసుకువెళ్లి వారికి అవగాహన కల్పిస్తున్నారు. మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 50 మంది విద్యార్థులు ఉండగా, ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు.



రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా లీడర్ ట్రైనర్‌గా సర్టిఫికేట్ అందుకుంటున్న షరీఫ్ అహ్మద్



లాగ్ అండ్ టైర్ బ్రిడ్జిలో శిక్షణ పొందుతున్న విద్యార్థి

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

తరగతి పాఠాలే కాకుండా వివిధ అంశాలపై విద్యార్థులకు బోధిస్తున్నారు. వారానికి ఒకటి, రెండు రోజులు మార్చ్ ఫాస్ట్, కథంతాల్, ఫుట్‌డ్రిల్, స్మార్ట్‌నెస్, గుడ్ ఆర్డర్ నేర్పిస్తున్నారు. పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు జాతీయ యూత్ అడ్వెంచర్ కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. 30 అడుగుల ఎత్తైన కొలంబో బ్రిడ్జ్ క్రాసింగ్, జిప్ లైనింగ్, రాక్ క్లైంబింగ్, ఆర్చరీ వంటి సాహసోపేత కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు వాస్తవ ప్రపంచం చూపించడమే లక్ష్యం

షరీఫ్ అహ్మద్, హిందీ ఉపాధ్యాయుడు



విద్యార్థులకు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాల్లోనే కాకుండా వాస్తవ ప్రపంచం చూపించడం మా లక్ష్యం. నేను విధులు నిర్వర్తించిన ప్రతి పాఠశాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం 12 మంది విద్యార్థులు గవర్నర్ అవార్డులు, 32 మంది విద్యార్థులు ప్రధాన మంత్రి అవార్డులు, ఒక విద్యార్థి రాష్ట్రపతి అవార్డు తీసుకున్నారు. విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తున్నారు.

అనుభవం మరింత ధైర్యాన్ని ఇచ్చింది

పి.రశ్మిత, 8వ తరగతి



పాఠశాలలో విద్యతో పాటు వివిధ రకాల శిక్షణ అనుభవం నాకు మరింత ధైర్యం అందించింది. టీమ్ గా కలిసి పనిచేసినప్పుడు నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. మేము కలిసి కష్టాలను ఎదుర్కొన్నప్పుడు అద్భుతమైన అనుభూతి, అనుభవం ద్వారా మిత్రుల మధ్య బంధం ఎంత ముఖ్యమో గుర్తించాను. ప్రతి కృషి విజయాన్ని అందించింది.

- **వీడియో పాఠాలు**

ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ఏర్పాట్లు చేస్తుండగా మల్లాపూర్ పాఠశాలలో కూడా డిజిటల్ బోధన అందిస్తున్నారు. రికార్డెడ్ పాఠాలు బోధించడంతో పాటు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)ను ఉపయోగించి వివిధ అంశాలపై వీడియోలు రూపొందించి విద్యార్థులకు అందిస్తున్నారు. సులభంగా పాఠాలు అర్థమయ్యేలా వీడియోలు రూపొందిస్తున్నారు. చదువుతో పాటు సమాజంలో ఎలా ఉండలానే దానిపై విద్యార్థులకు మానవీయ విలువలను తెలుపుతూ వీడియోలను తరగతి గదిలో ప్రదర్శిస్తున్నారు. తల్లిదండ్రులు, అంధులు, అంగవైకల్యం, మహిళలు, పసిపిల్లలు, వృద్ధాప్యంలో ఉన్నవారికి ఎలాంటి గౌరవం ఇవ్వాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు.



మానవీయ విలువ పై విద్యార్థుల ప్రదర్శన

సాహస కృత్యాలు నాలోని భయాలను పోగొట్టింది

ఆర్.మహేష్, 9వ తరగతి,



మా పాఠశాలలో చదువుతో పాటు వివిధ అంశాల పై శిక్షణ ఇస్తుండటంతో ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలనిపిస్తుంది.



షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థిని

సాహస కృత్యాలతో నాలోని భయం పోయింది. ఇప్పుడు నేను కొత్త కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంగా ఉన్నాను. పాఠశాలలో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం.




ఆర్చరీలో శిక్షణ పొందుతున్న విద్యార్థి

మా సర్ ప్రోత్సాహం ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది

ఎం.భువన్ తేజ్, 7వ తరగతి



పాఠశాల అంటే భయం పోయింది. నాకు మా సర్ ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. నాకు ఈ అనుభవం చాలా ప్రత్యేకంగా ఉంది. నాకు స్నేహితులను సహాయం కోరడం ఎంత ముఖ్యమో చూపించింది. ఇలాంటి అనుభవం ద్వారా స్నేహితుల సహకారం, మద్దతు మన విజయానికి ఎంత కీలకమైనదో అర్థం చేసుకున్నాను.



మల్లాపూర్ పాఠశాల భవనము, పక్కన ఎత్తయిన గుట్ట

చారిత్రక అంశాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేందుకు వివిధ చారిత్రక ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడ ఉన్న కట్టడాలను వారి చరిత్రను ప్రత్యేకతలను తెలుసుకునే విధంగా అవకాశం కల్పిస్తున్నారు. ఢిల్లీ, అగ్రాలోని ప్రధాన చారిత్రాత్మక ప్రదేశాలు ఎర్రకోట, లోటస్ టెం పుల్, కుతుబ్ మినార్, ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్, అక్షర్‌ధామ్ టెంపుల్, తాజ్‌మహల్, అగ్రా కోటను సందర్శించా రు. హర్యానాలో పర్యటించిన విద్యార్థులు హర్యానాలోని మోడల్ పాఠశాలలను సందర్శించి, స్థానిక విద్యార్థులతో కలిసి కొత్త అనుభవాలు తెలుసుకున్నారు.



చారిత్రక ప్రదేశాల పర్యటనలో భాగంగా..

ఎస్‌యూను నంబర్‌వన్
యూనివర్సిటీగా తీర్చిదిద్దుతా

- న్యాక్ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం
- త్వరలోనే రెండు ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి
- నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీని రాష్ట్రంలోనే నంబర్‌వన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ తెలిపారు. వీసీగా నియామకమయ్యాక సోమవారం మొదటిసారిగా ఆయన శాతవాహన యూనివర్సిటీకి రాగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. వీసీ చాంబర్‌లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. బాధ్యత స్వీకరణ అనంతరం పలువురు యూనివర్సిటీ అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. యూనివర్సిటీలో రెండు ఇంజినీరిం గ్ కళాశాలల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కావాల్సిన స్థలం మనకు అందుబాటులో ఉన్నదని తెలిపారు. యూనివర్సిటీలో కొత్త కోర్సులు, విద్యార్థులకు ఉపయోగపడే, జాబ్ ఓరియంటడ్, మల్టీ డిసిప్లేనర్ కోర్సుల ప్రవేశానికి ప్రత్యేకంగా దృష్టి పెడతామన్నారు. ఇందులో ఏ కోర్సు నుంచి ఏ కోర్సుకైనా వెళ్లాలా అవకాశం ఉంటుందన్నారు. తాను రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో యూనివర్సిటీలో స్నాతకోత్సవం నిర్వహించామన్నారు. గవర్నర్, ఛాన్స్‌లర్ జిష్ణు దేవ్‌వర్మను ఆహ్వానించి రెండో స్నాతకోత్సవ నిర్వహణకు చర్యలు తీసుకుంటానని వీసీ తెలిపారు. యూనివర్సిటీ సమస్యలను పలువురు ఇప్పటికే తన దృష్టికి తీసుకవచ్చారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్సిటీలో బీఈడీ, ఎం ఈడీ కళాశాలల ఏర్పాటు విషయం కూడా పరిశీలస్తామన్నారు. కార్యక్ర మంలో రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, ప్రసాద్, పరీక్షల నియంత్రణాధికారి ఎస్వీ శ్రీరంగ ప్రసాద్, యూనివర్సిటీ ఆర్ట్స కాలేజీ ప్రిన్సిపాల్ ఎండీ జాఫర్ జారీ, యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ హరికాంత్, యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి పాల్గొన్నారు.



వీసీ ఉమేష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అధ్యాపకులు



చరిత్ర

గంట స్తంభం.. గత వైభవ చిహ్నం

జగిత్యాల ప్రాశస్త్యాన్ని చాటుతున్న వైనం

జిల్లా వాసులను ఆకట్టుకుంటున్న నిర్మాణం

జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల గత వైభవానికి చిహ్నంగా క్లాక్ టవర్ నిలుస్తోంది. ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని ప్రజలకు నేనున్నాంటూ పట్టణ నడిబొడ్డున ధీమాగా నాలుగు ముఖాల క్లాక్ టవర్ నిలిచింది. క్లాక్ టవర్ పట్టణ అందాన్ని మరింత ఇనుమడింపజేస్తోంది. దీనిని చల్‌గల్‌కు చెందిన 1936 సంవత్సరంలో ధర్మా జలపతి రావు దేశ్‌ముఖ్ నిర్మించారని స్థానికులు అంటున్నారు.

ఇందులోని గడియారం జర్మని నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి తీసుక వచ్చారని చెబుతున్నారు. ప్రజలు ప్రాణాంతకమైన కలరా వ్యాధి నుంచి కోలుకున్న సందర్భంగా దాని నిర్మూలనకు సాక్ష్యంగా దేశ్‌ముఖ్ ధర్మా జలపతి రావు నిర్మించారని కథనం ప్రచారంలో ఉంది. గంట గంటకు మోగే ఈ గడియారం చదువురాని సామాన్యులకు సైతం సమయం తెలిసిపోయేలా ఏర్పాటు చేశారు. అయితే చారిత్రకమైన టవర్‌లో గల క్లాక్ ప్రస్తుతం మరమ్మతుకు గురై పనిచేయడం లేదు. తొలినాళ్లలో కాషాయం, తెలుపు రంగు పైభాగంతో సుమారు 60 అడుగుల ఎత్తయిన అష్టభుజి గోపురం దీని ప్రత్యేకత అని అంటున్నారు. స్తంభానికి ఎత్తయిన భాగంలో నాలుగు వైపుల కనిపించేలా గడియారం ఏర్పాటు చేశారు. ఈ తదుపరి కాలంలో దీనికి పలు పర్యాయాలు రంగులు మారాయి. పైన నీలి రంగు, చుట్టూ తెలుపు, యాష్ రంగులతో ప్రస్తుతం టవర్ ఉంది. పలు పండుగలు, దినోత్సవాల సందర్భంగా రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఈ చారిత్రక చిహ్నం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జగిత్యాల పేరు చెబితే గుర్తుకు వచ్చే వాటిలో టవర్ కూడా ఒకటిగా గుర్తింపు పొందింది. పట్టణ నడిబొడ్డున గల టవర్ నాలుగు వైపుల ప్రధాన రహదారులు వాటికి ఇరువైపుల వ్యాపార, వాణిజ్య సముదాయాలున్నాయి. ప్రస్తుతం పనిచేయని గడియారం, సైరన్‌లను మరమ్మతు చేయాల్సిన అవసరముంది. పాలకులు పట్టించుకొని క్లాక్ టవర్ అభివృద్ధికి కృషి చేయా లని, టవర్ చరిత్రను, విశిష్టతను పర్యాటకులు తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు విడుతల్లో భర్తీ చేయగా మిగిలిన సీట్లను వాక్ ఇన్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పాసైన అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ లో వెరిఫికేషన్ ఫీజు ఒక రూపాయి చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోకుండా నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇప్పటికీ సీట్లు కేటాయించిన వారికి వాక్ ఇన్ అడ్మిష న్స్‌లో అవకాశం లేదన్నారు. మరిన్ని వివరాలకు 7799100360, 9989182747 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జోనల్ స్థాయి క్రీడలో ప్రతిభ

కోరుట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడ పోటీలలో పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ విద్యార్థి షణ్ముక తేజ ప్రతిభ కనపరిచి రాణించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. అండర్ 14 విభాగంలో లాంగ్ జంప్ పోటీలలో షణ్ముక తేజ రాణించి మొదట స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయినట్లు సత్యనారాయణ తెలిపారు. ప్రతిభ కనపరిచిన షణ్ముక తేజను పాఠశాల కరస్పాండెంట్ తుమ్మనపల్ల సత్యనారాయణ, ప్రిన్సిపల్ తుమ్మనపల్లి మనోజ్ కుమార్, పీఈటీలు గౌతమి, అనసూర్య, నరహరిలు అభినించారు.

మాజీ మంత్రి పరామర్శ

పెగడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని రామభద్రునిపల్లి గ్రామానికి చెందిన అనంతుల చంద్రయ్య కుటంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు. చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కొప్పుల ఈశ్వర్ మండల నాయకులతో కలసి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

బుగ్గారం : మండలంలోని వెల్గొండ, గోపులాపూర్, మద్దునూర్, బుగ్గారం గ్రామాలలో మృతి చెందిన పలు కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నూరు లక్ష్మి కాలు విరగడంతో ఆమెను పరామర్శించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోరుట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండంగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి సుమారు 40ఏళ్ల వయసు కల వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. వ్యక్తి తెల్లని షర్ట్, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అధిక మద్యం సేవించి మృతి చెందినట్లు పోలీసులు స్థానికులు బావిస్తున్నారు. మృతదేహాన్ని కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిని గురించిన వారు కోరుట్ల ఎస్ఐ 8712656790, కోరుట్ల సీఐ 8712656820 సెల్ నంబర్‌లను సంప్రదించాలని వారు సూచించారు.

నోరూరించే..సీతాఫలం

5వ పేజీ తరువాయి..



సీతా ఫలాలు విక్రయిస్తున్న రైతులు

రసాయనిక మందులు వాడకుండా..

గతంలో సీతాఫలాలు తెంపి వాటిని వరిగడ్డిలో మాగపెట్టి పండిన తదుపరి విక్రయించే వారు. కానీ ప్రస్తుతం చెట్లపైనే కాయలు పండిన తర్వాత తెంపి విక్రయిస్తున్నారు. మరికొం దరు కాయలు తెంపి నేరుగా విక్రయిస్తున్నారు. తెంపిన పండ్లను వెంటనే విక్రయిస్తుండడంతో తాజాగా ఉంటున్నాయి. వీటికి ఎలాంటి రసాయనిక మందులు వినియోగించక పోవ దంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. పండ్లు మంచి రుచిగా ఉండడంతో ధర కాస్త ఎక్కువైనా కొనుగోలు చేయడానికి ప్రజ లు ముందుకు వస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన సీతా ఫ లాలను ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి ముంబాయి, బీవండి, పుణే, హైద్రాబాద్, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో ఉన్నత విద్యా భ్యాసం, ఉద్యోగ అవసరాల నిమిత్తం వెళ్లిన కుటుంబ సభ్యు లకు పలువురు పంపుతున్నారు.

ఏన్నో ఏళ్ల నుంచి అమ్ముతున్నా...



ప్రతీ యేటా అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాల్లో సీతాఫలాలు చెట్లకు కాస్తుంటాయి. కొన్నేళ్లుగా సీతా ఫలాలు తెంపి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాను. ఈ ప్రాంతా నికి చెందిన కొందరు సీతా ఫలాలను జగిత్యాల, కోరుట్ల వంటి ప్రాంతాలకు తీసుకవెళ్లి అమ్ముతున్నారు. కష్టపడితే మంచి ఆదాయం వస్తుంది.

- పంబాల నల్ల కొండయ్య, తాటిపల్లి గ్రామం, మల్యాల మండలం

పండ్లు తాజాగా ఉండడంతోనే...



గుట్టల ప్రాంతాల్లో గల చెట్ల నుంచి సేకరించిన పండ్లు తాజాగా, రుచికరంగా ఉండడంతోనే వినియోగదారుల వద్ద నుంచి డిమాండ్ ఉంటుంది. దారి వెంట నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులతో పాటు కార్లు, బస్సులు, ఇతర వాహనాల్లో వెళ్తున్నవారు సైతం మా వద్ద కొద్దిసేపు ఆగి సీతా ఫలాలు కొనుగోలు చేస్తున్నారు.

- గడువు లక్ష్మీ, మహిళా రైతు, మల్యాల, జగిత్యాల జిల్లా

పోలీస్ అమర వీరుల ఆశయాలను కొనసాగించాలి

● ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి



అమరులకు గౌరవ వందనం చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

ధర్మపురి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో తమ ప్రాణాలు కోల్పోయి అమరులుగా మిగిలిన పోలీసుల ఆశయాలను కొనసాగించాలని ధర్మపురి పోలీస్ సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ధర్మపురి పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ అమర వీరుల స్తూపం వద్ద సోమవారం ఎస్ఐలు గంగుల మహేష్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, పోలీస్ సిబ్బందితో కలిసి గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన అమర వీరుల స్తూపం పైన పూలు చల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ ఉద్యోగులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. వివిధ సందర్భాల్లో ప్రాణాలు అర్పించి అమరులు అయిన పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అందించిన సేవలను ఆయన కొనియాడారు. పోలీసులు ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ కోసం నిరంతరం అందిస్తున్న సేవలను గుర్తించాలన్నారు. అలాగే పోలీస్‌లకు శాంతి భద్రత విషయంలో ప్రజలు తగు సహకారం అందించాలని ఆయన కోరారు. ఏఎస్ఐలు సూర్యనారాయణరాజు, రామమూర్తి, రాజేశం, హెచ్‌సీలు శంకర్, ఎండీ సలీమొద్దీన్, శంకరయ్య, వెంకటయ్య, పీసీలు, హెచ్‌జీలు పాల్గొన్నారు.

కథలాపూర్ : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం మండలంలోని సిరికొండలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. 1959లో చైనా దురాక్రమణ సందర్భంగా భారత సైనికులు వీరోచిత పోరాటం చేసి శత్రువులను చిత్తుచేసి వీరమరణం చెందారన్నారు. అంతర్గత శత్రువుల నుంచి కాపాడి భద్రతకు భరోసాను ఇస్తూ తమ ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించుకుని కొద్ది సేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా గాంధారి శ్రీనివాస్, కాశోజి ప్రతాప్, మల్యాల మారుతి, అల్లోటి ప్రమోద్, రవి, శ్రీకాంత్ ఉన్నారు.

సారంగాపూర్ : శాంతి పరిరక్షణలో బాగంగా ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరుల సంస్మరణ వేడుకలను సోమవారం మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. ఎస్సై దత్తాద్రి పోలీసు అమరుల విగ్రాహనికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోలీసుల అమరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

5వ పేజీ తరువాయి..

ఆంధ్రజ్యోతి : ఏ నెలలో ఎంత ధాన్యం వస్తుందని అంచనా ఉంది..?

అదనపు కలెక్టర్ : జిల్లా వ్యాప్తంగా 5.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశాము. ఇందులో అక్టోబర్‌లో 57 వేల మెట్రిక్ టన్నులు, నవంబరులో 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 2.87 లక్షల మెట్రిక్ టన్నులు, జనవరిలో 57 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉంది.

ఆంధ్రజ్యోతి : క్వింటాలుకు మద్దతు ధర ఎంత ఉంది..?

అదనపు కలెక్టర్ : గత సీజన్‌లో ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2,203, బీ గ్రేడ్ సాధారణ రకం వడ్లకు రూ. 2,183 చెల్లించారు. ప్రస్తుత యేడాది ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,320, సాధారణ బీ గ్రేడ్ రకానికి రూ. 2,300 ధర నిర్ణయించారు. గత యేడాది కంటే అదనంగా మద్దతు ధర పెరిగింది.

ఆంధ్రజ్యోతి : సన్నరకాల కొనుగోళ్ల పరిస్థితి ఏమిటి...?

అదనపు కలెక్టర్ : జిల్లాలో సన్నరకాల కొనుగోళ్ల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము. పలు ప్రాంతాల్లో సుమారు 63 కేంద్రాలను ప్రత్యేకంగా సన్నరకాల కోసం ఏర్పాటు చేశాము. రైతు కేంద్రానికి తరలించిన ధాన్యం ఏ రకానికి అన్నది వ్యవసాయ అధికారులు గుర్తిస్తారు. కొనుగోళ్ల అనంతరం బోనస్‌ను సంబంధిత రైతు ఖాతాల్లో ప్రభుత్వ జమ చేస్తుంది.

ఆంధ్రజ్యోతి : రైతులకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు....?

అదనపు కలెక్టర్ : రైతులు పండించిన పంటను సమీపంలో కొనుగోలు కేంద్రానికి తరలించి విక్రయించాలి. కొనుగోలు కేంద్రం వద్ద నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ధాన్యంలో 17 శాతం కంటే తక్కువ తేమ ఉన్నప్పుడే మద్దతు ధర లభిస్తుంది. రైతులు ధాన్యం బాగా ఆరబోసి కేంద్రాలకు తీసుకొస్తే తూకం వేయడంలో ఇబ్బందులు ఉండవు. అధికార యంత్రాం గానికి రైతులు సహకరించాలి.

ఆహారంలో అయోడిన్ ఉండేలా చూసుకోవాలి

● జిల్లా వైద్యాధికారి సమీయొద్దీన్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తినే ఆహారంలో ఐదు గ్రాముల అయోడిన్ సాల్ట్ ఉండేలా చూసుకోవాలని జిల్లా వైద్యాధికారి సమీయొద్దీన్ అన్నారు. సోమవారం అయోడిన్ డెఫిషియెన్సీ డిజార్డర్ కంట్రోల్ డేను పురస్కరించుకుని సిబ్బందికి అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోపం వలన గర్భస్రావం, మృత శిశు జననం, అసంపూర్ణ పిండం, మానసిక, శారీరక పెరుగుదల, గాయిటర్, బుద్ధి మాంద్యత, మరు గుజ్జుతనం, తక్కువ అభ్యసన సమస్యలు వస్తాయని అన్నారు. ప్రధానంగా అయోడిన్, థైరాయిడ్ గ్రంధిలో కీలకంగా వ్యవహరించే టి-3, టి-4, థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్లను స్రవించడంలో తోడ్పాటు అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్య శాఖ అధికారి జైపాల్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాల్లో దోపిడీని అరికట్టాలి

మల్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మీసేవా కేంద్రాల్లో వివిధ ధృవీకరణ పత్రాల కోసం ప్రజల నుంచి ఇష్టారాజ్యంగా దోపిడికి పాల్పడుతున్నారని అధిక వసూళ్లను అరికట్టాలని మండల కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మీ సేవా కేంద్రాల వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలని కోరారు.

దోపికి పాల్పడుతున్న కేంద్రాలపై చర్యలు తీసుకుంటూ సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇకపై తరచూ తనిఖీలు చేయాలని విన్నవించారు. నేరెళ్ల సతీష్‌రెడ్డి, కట్కం వినయ్, తాళ్ల హరినాథ్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మత్స్య సంపద పెంచి గంగపుత్రులకు జీవనోపాధి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తాండ్రియాలలో ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంలో భాగంగా ఊర చెరువులో 30 వేల చేపలను వదిలిన అనంతరం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చెరువులు ధ్వంసం కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రథమ పాధాన్యంగా చెరువులు, కుంటలను మరమ్మతులు చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. ఆ క్రమంలోనే ఊరచెరువు మత్తడిని నిర్మించడం వల్ల ప్రస్తుతం చెరువుకు జలకళ వచ్చిందన్నారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి తాగు, సాగు నీటి అవసరాలు తీరడమే కాకుండా మత్స్య సంపద పెరిగి స్థానిక మత్స్యకారులకు ఉపాధి లభించనుందన్నారు. సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువల్లో భూములు కోల్పోతున్న రైతులకు రు. 10 కోట్లు కొద్ది రోజుల్లో మంజూరు కానున్నాయని పనులు కూడా ప్రారంభించబోతున్నామన్నారు. జిల్లా మత్స్యకార అధికారిణి విజయభారతి మాట్లాడుతూ జిల్లాలో 261 మత్స్య సహాకార సంఘాలు ఉండగా అందులో 18వేల 500 మంది సభ్యులు ఉన్నారని వివరించారు. 237 చెరువుల్లో 84 లక్షల చేపలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, కథలాపూర్ చెరువుల్లో 20 లక్షల చేపలు పెంచుతామని పేర్కొన్నారు. మత్స్య కారులు గ్రూపు ఇన్సూరెన్స్ పథకం సద్వినియోగం చేసుకోవాలని అందుకు ప్రీమియం ప్రభుత్వమే చెల్లింస్తుందన్నారు. మత్స్యకారులకు మత్స్యబంధు పథకం అమలు చేయాలని జిల్లా మత్స్య పారి శ్రామిక సహాకార సంఘం చీఫ్ ప్రమోటర్ పల్లికొండ ప్రవీణ్ ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఏవో యోగిత, ఆర్ఐ నగేశ్, పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, రాష్ట్ర ఫిషరీస్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి ఉన్నారు.

కోతుల బెడద నివారించండి..

ప్రజావాణిలో వినతి పత్రం అందించిన మాజీ సర్పంచు

కొడిమ్యాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చెప్యాల గ్రామంలో కోతుల బెడదను నివారించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో మండలంలోని చెప్యాల గ్రామ మాజీ సర్పంచు అక్కపెల్లి రాజేశం వినతి పత్రం అందించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉదయం పూట ఇంటి ముందు పని చేసుకునే మహిళలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు గ్రామంలో కోతులు, కుక్కల వలన భయాందోళన చెందుతున్నారని వినతి పత్రంలో పెర్కొన్నారు. గ్రామానికి చెందిన సత్తవ్వ అనే మహిళ ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెల్లుతుండగా కోతుల మంద అడ్డు రావడంతో భయంతో కింద పడగా పక్కటెముకలు విరిగి ఆసుపత్రి పాలైనట్లు పెర్కొన్నారు. గ్రామంలో కోతుల, కుక్కల బెడద నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకోకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రాయికల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్, సింగరావుపేట గ్రామాల్లో సోమవారం పశువులకు పశు వైద్యాధికారి నరేష్ రెడ్డి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్లు ఎలిగేటి రవీందర్, వెటర్నరీ అసిస్టెంట్ కట్కం రమేష్, కార్యాలయ సహాయకులు షేక్ అహ్మద్, తలారి బక్కయ్య, అనిల్, పోచయ్య, రైతులు వెంకట సుబ్బారావు, పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికే సంఘం ప్రాధాన్యం

నంచర్ల సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాల్

పెగడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికే సహకార సంఘం అధిక ప్రాధాన్యతనిస్తుందని నంచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు మంత్రి వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని నంచర్ల సింగిల్‌విండో సర్వసభ్యసమావేశం సోమవారం సంఘం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సంఘం వ్యాపార దోరణితో కాకుండా సంఘం పరిధిలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడంతో పాటు పెట్రోల్ బంక్ ద్వారా కల్తీలేని తక్కువ ధరలో పెట్రోల్, డీజిల్ అందించడం , బంగారం తాకట్టు రుణాలు, పంట రుణాలు అందిస్తూ రైతుల అభ్యున్నతికి దోహదపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఈవో రౌతు మధూకర్, ఉపాధ్యక్షులు సురెందర్ రావు, దత్తత అధికారి మల్లేశం, డైరక్టర్లు పాల్గొన్నారు.

కుదువ పెట్టిన బంగారం ఇవ్వాలంటూ ఆందోళన

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కుదవ పెట్టిన బంగారం తిరిగి ఇవ్వాలంటూ బాధితులు సోమవారం పట్టణంలోని జువెల్లర్ షాపు ముందు ఆందోళనకు దిగారు. పట్టణంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు పట్టణానికి చెందిన నగల వ్యాపారి రాకేష్ వద్ద బంగారం కుదువపెట్టారు. కొన్ని రోజులుగా తిరిగి ఇవ్వాలంటూ బాధితులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే సోమవారం జువెల్లరు షాపు యజమాని షాపు ఒపెన్ చేయగా బాధితులు మళ్లీ ఆందోళనకు దిగారు. తమ బంగారం తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుదవపెట్టిన బంగారం ఇచ్చేంత వరకు కదిలేదిలేదని నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఎస్ఐ-2 రాజు అక్కడకు చేరుకోని బాధితులతో మాట్లాడారు. న్యాయం జరిగేల చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరిమించారు.

దిష్టి బొమ్మ దహనం

కొడిమ్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాదులోని ముత్యాలమ్మ గుడిలోకి చొరబడి అమ్మవారి విగ్రహం కాలితో తన్ని ధ్వంసం చేసిన వ్యక్తి దిష్టిబొమ్మను సోమవారం మండల కేంద్రంలోని అంగడి బజారులో హిందు బంధువుల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు హిందువులపై లాఠీచార్జి చేయటం సరికాదన్నారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్, హిందు సంఘాల, హిందు ఏక్తా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో దెబ్బతిన్న పంట పొలాలు

బీర్‌పూర్, అక్టోబరు 21: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షం కారణంగా ఆయా గ్రామాలలో సుమారుగా 100 ఎకరాలలో వరి పంట నేలవాలి దెబ్బ తిన్నదని ప్రభుత్వపరంగా రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఎవరిదో..?

పాలక వర్గం ఏర్పాటుపై ఆశావాహుల ఎదురుచూపులు



మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై రోజు రోజుకూ ఉత్కంఠ నెలకొంటోంది. చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని అంతా ఆసక్తిగా చూస్తున్నారు. నియోజకవర్గంలో నాలుగు వ్యవ సాయ మార్కెట్ కమిటీలు ఉండగా మూడింటిని ఏర్పాటు చేశారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ జనరల్ కావడంతో పాలక వర్గం ఏర్పాటుపై నియోజక వర్గంలోని ముఖ్య నేతలు తమ వర్గంలోని నాయకులకు పదవులు ఇప్పించాలని పట్టుబట్టారు. దీంతో ఏకాభిప్రాయం కుదరక పోవడంతో నిలిచిపోయింది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తమ అనుయాయులకు పదవులు ఇచ్చి నియోజక వర్గంలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మార్కెట్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించి బంగపడ్డ కల్వకుంట్ల సుజిత్ రావు కూడా మెట్‌పల్లి వ్యవ సాయ మార్కెట్ కమిటీ మొదలుకుని చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గాన్ని నియమించేం దుకు పట్టుబట్టి, పాలక వర్గం పేర్లను కూడా వ్యయసాయ మంత్రిత్వ శాఖకు పంపించినట్లు విశ్వసనీయ సమచారం. దీంతో మెట్‌పల్లి చైర్మన్‌పై నేతల మధ్య పోటీ నెలకొంది. పోరులో ఏవరు నెగ్గుతారనే ఆసక్తి ఇరు వర్గాల నాయకుల మధ్య నెలకొంది.

పెరుగుతున్న ఆశావాహులు...

మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ జనరల్ కావడంతో ము ఖ్య నేతలు తమ ప్రయత్నాలకు పదును పెట్టారు. పదవిని ఎవరికి కట్టుబెట్టాలనే విషయంలో స్పష్టత లేకపోవడంతో చైర్మన్ పీఠంపై ఆశలు పెట్టుకున్న వారు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ప్రధానంగా నియోజక వర్గంలో తన వర్గాన్ని పెంచుకోవడానికి టీపీ సీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు అనుచరుడైన కూన గోవర్ధన్ పేరును వ్యవసాయ శాఖ మంత్రిని కోరుతుండగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న జువ్వాడి నర్సింగరావు మెట్‌పల్లిలో ఏండ్ల నుంచి తన వెంట ఉన్న తిప్పిరెడ్డి అంజిరెడ్డి పేరును మంత్రిత్వ శాఖకు సూచించినట్లు సమాచారం. దీంతో ఆ పదవి కోసం బ్లాక్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి ఆ పదవిని ఆశిస్తున్నట్లు ప్రాచారం సాగుతోంది.

● స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు..

స్థానిక సంస్థల ఎన్నికలు ముందుండడంతో గ్రామాల్లో పట్టు నిలబెట్టుకోవడానికి ముఖ్య నేతలు మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నియామకంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక చేయడంలో తమ మార్కును నిలబెట్టుకోవడానికి చైర్మన్ పదవి కీలకంగా మారే అవకాశం ఉండడంతో పార్టీలో ఇప్పుడు అందరు అటువైపే చూస్తున్నారు. దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులను తమ వెంట నిలబడాలంటే స్థానిక ఎన్నికలు కీలకంగా మారనున్నాయి. దీంతో మార్కెట్ చైర్మన్ పదవిని తమ వర్గానికి చెందిన ముఖ్య నేతలకు దక్కించుకోవ డానికి ముఖ్యనేతలంతా కీలక నేతలతో పాటు మంత్రులను కలుస్తూ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరువర్గాల నాయకులు గట్టిగా ప్రయత్నాలు చేయడంతో చైర్మన్ పదవి కొంత ఆలస్యమవుతుందని నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొదలుకుని, చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరనేది మంత్రిత్వ శాఖ దాదాపు నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయంగా సమాచారం.

రైతులను తప్పుదోవ పట్టించడం సరికాదు

కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి

మల్లాపూర్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పు దోవ పట్టించడం సరికాదని కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు వెలి చాలా చిన్నారెడ్డి హితవు పలికారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరు సమావేశంలో మాట్లాడారు. గత పాలనలో బీఆర్ఎస్ రైతులను పట్టించు కోకుండా జమీందారులు, భూస్వాములు, దొరలకు రైతుబంధు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం పేద రైతులకు రైతుబంధు ఇవ్వాలని ఆలచనతో కొంచెం ఆలస్యం చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం సమం జసం కాదన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు రుణమాఫీ చేయకుండా కాలం వెళ్లదీసిన వారు రుణ మాఫీపై మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, గోపిడి రాజశేఖర్‌రెడ్డి, కొమిరెడ్డి రాజారెడ్డి, పుండ్ర లక్ష్మారెడ్డి, నల్ల రాజారెడ్డి, క్యాతం మల్లారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపల్లి జీవన్ రెడ్డి, అని తడుపుల నర్సయ్య, నూతిపెల్లి రాజన్, నాసం తిరుపతి, కొండపల్లి ఎలాల రాజేష్, రామ లక్ష్మణ్, ఎర్ర భూమయ్య, రొండ్ల రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, సింగిల్ విండో చైర్మెన్‌లు నర్సరెడ్డి, జగన్‌మోహన్‌రావు, బండి భూమయ్య, అధిరెడ్డిలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఐకేసీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు నాగులపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

పాఠశాలకు ప్రొజెక్టర్, ఎలక్ట్రానిక్ బెల్ విరాళం

కథలాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో చదివిన 2015-16 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు సోమవారం ప్రొజెక్టర్, స్క్రీన్, ఎలక్ట్రానిక్ బెల్ విరాళంగా అందించారు.

ప్రస్తుతం డిజిటల్ పాఠశాలు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎంతో అనువుగా ఉంటుందనే ఉద్దేశ్యంతో తమ వంతు సాయం అందించామని తెలిపారు. రాబోవు రోజుల్లో కూడా తాము సాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక

కొడిమ్యాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చొక్కాల వైష్ణవి, సామల పూజ, మచ్చ నవిత అండర్ 19 బాలికల విభాగంలో సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. వేణు తెలిపారు. అంతే కాకుండ అండర్19 బాలుర విభాగంలో ఎర్రోజు తక్షిల్ ఎంపికైనట్లు తెలిపారు. వీరిని జిల్లా నోడల్ అధికారి కె. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్, పీడీ భాస్కర్, అధ్యా పకులు అభినందించారు.

దొంగ పట్టివేత

జగిత్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల టౌన్‌తో పాటు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన వడ్లూరి నాగరాజు అనే పాత నేరస్థుడు పట్టణంతో పాటు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుడి వద్ద రూ. 20 వేల విలువ గల వెండి, రాగి, ఇత్తడి వస్తువులతో పాటు రూ. 3,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వేణు గోపాల్ వివరించారు.

జర్నలిస్ట్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జర్నలిస్ట్ సుదర్శన్‌పై దాడి, హత్యయత్నం చేసిన దుండగులందరిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు సోమవారం పట్టణంలోని ఎస్సారెస్పి మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా (టీయూడబ్ల్యూజే ఐజేయు) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగ సురేష్, భూరం సంజీవ్‌ల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడిలో పాల్గొన్నాది ఏడుగురు అయితే ముగ్గురినే అరెస్ట్ చేశారని మిగత వారిని కూడ అరెస్ట్ చేయాలని అన్నారు. జర్నలిస్ట్‌లపై దాడులు జరుగకుండ ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు దాసం కిషన్, ఉపాధ్యక్షులు మాసుల ప్రవీణ్, మహ్మద్ అజీమ్, శివ తదితరులు పాల్గొన్నారు.